సాక్షి
ప్రకాశం
మంగళవారం ❘ 14 ❘ అక్టోబర్ ❘ 2025



గడువులోగా పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించారు.

- 8లో..



విద్యుదాఘాతానికి బేల్దారి కూలీ బలి

విద్యుదాఘాతానికి గురై బేల్దారి కూలీ మృతిచెందిన ఘటన కంభం మండలం కందులాపురం కూడలిలో సోమవారం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
27/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

హాస్టళ్లు తనిఖీ చేసిన ఎమ్మెల్యే తాటిపర్తి



బాలికల హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ సోమవారం పట్టణంలో ఉన్న హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ బాలికలు, బాలుర హాస్టళ్లలో ఉన్న విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఆయా వసతి గృహాల్లో ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. శుభ్రమైన భోజనం, శుద్ధి చేసిన నీటిని విద్యార్థులకు అందించాలని వార్డన్‌లకు సూచించారు. ఆయన వెంట ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి ఉన్నారు.

సురక్షితమైన జీవితానికి ఏడు సూత్రాలు

- గ్లోబల్ హ్యాండ్ వాష్ డే పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: సురక్షితమైన జీవితానికి ఏడు సూత్రాలు పాటిస్తే అనారోగ్యంపాలు కాకుండా చేసుకోవచ్చని కలెక్టర్ పీ.రాజాబాబు పేర్కొన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాధాన్యతను వివరిస్తూ ముద్రించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం భవన్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, యూనిసెఫ్, విజయ వాణి చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ పీ.రాజాబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ముఖ్యమైన ఏడు సందర్భాల్లో చేతులను కడుక్కోవడం అలవాటుగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌ఓ ఓబులేసు, జిల్లా విద్యాధికారి కిరణ్ కుమార్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ టీ రంగారావు, వాష్ ప్రోగ్రాం ప్రతినిధి కే మరియబాబు పాల్గొన్నారు.

పాకల బీచ్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు

ఒంగోలు టౌన్: కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని పాకల బీచ్‌కు ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ప్రజా రవాణాధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి గంటకు ఒక బస్సు సర్వీసును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పొదిలి ఆర్టీసీ డిపో నుంచి ఉదయం రెండు, మధ్యాహ్నం రెండు ట్రిప్పులు వేసినట్లు చెప్పారు. కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి కందుకూరు మీదుగా 4 బస్సు సర్వీసులు, కందుకూరు డిపోలో 6 బస్సు సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రూపుల వారీగా వనభోజనాలకు వెళ్లే వారికి అద్దె ప్రతిపాదికన ప్రత్యేక బస్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు.



మార్కాపురంలో ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న అన్నా రాంబాబు, నాయకులు



ఒంగోలులో ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్తున్న చుండూరి రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు

నకిలీ మద్యంపై జనగర్జన

కల్తీ మద్యంపై ప్రజలు గర్జించారు. నకిలీ మద్యం ప్రాణాలు హరిస్తోందంటూ జిల్లాలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, కాసులకు కక్కుర్తిపడి కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారంటూ పోరుబాట పట్టారు. నకిలీ మద్యం గుట్టు తేల్చాలంటూ డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులు, పార్టీ జెండాలు చేతబూని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ఎత్తున ర్యాలీలతో కదం తొక్కారు. మద్యం షాపుల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిరోధించాలని నిరసన తెలిపారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా అన్ని చోట్లా జనం భారీగా తరలివచ్చారు.



చీమకుర్తిలో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, తదితరులు

- జిల్లా అంతటా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆందోళనలు
- భారీ ర్యాలీలు, ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసనలు
- ప్రభుత్వ తీరును ఎండగడుతూ నినాదాలు
- నకిలీ మద్యం గుట్టు తేల్చాలంటూ డిమాండ్
- పలు చోట్ల పోలీసుల ఆంక్షలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నకిలీ మద్యం తయారీని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జిల్లా అంతటా నిరసనలు పెల్లుబికాయి. రాష్ట్రంలో కల్తీ మద్యం కుటీర పరిశ్రమలా తయారైందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసి చేతులు దులుపుకుందని, సీబీఐతో విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, ఎస్ఎన్ పాడు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. నకిలీ మద్యాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. యర్రగొండపాలెం పట్టణంలో భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. నల్ల బ్యాడ్జీలు, జగనన్న ఫొటోలు ఉన్న టోపీలు ధరించి ప్లకార్డులు, పార్టీ జెండాలు పట్టుకుని కదంతొక్కారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు వచ్చిన పోలీసులు ర్యాలీ చేయవద్దని, జెండాలు, ప్లకార్డులు పట్టుకోవద్దని ఆంక్షలు విధించారు. ఆ ఆంక్షలను లెక్కచేయకుండా నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలను దుయ్యబడుతూ మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్దకు చేరిన భారీ ర్యాలీని పోలీసులు అదుపు చేయాల్సి వచ్చింది. ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చేందుకు ఎమ్మెల్యేతో పాటు మరి కొంతమందిని మాత్రమే అనుమతిచ్చారు.



యర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజలు చీమకుర్తి ఎన్ఎస్‌పీ కాలనీ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకుడు బొట్ల రామారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కల్తీ మద్యంపై రాష్ట్ర ప్రభుత్వం కేవలం సిట్ వేసి చేతులు దులుపుకుందని, సీబీఐ విచారణ జరిపించాలని మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తూ కాసులకు కక్కుర్తిపడి కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందన్నారు.

కుటీర పరిశ్రమగా కల్తీ మద్యం తయారీ...

మార్కాపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సీఐ వెంకటరెడ్డికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బెల్టుషాపుల ద్వారా కుటీర పరిశ్రమగా కల్తీ మద్యాన్ని ప్రజలకు సరఫరా చేసి వారి ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టారని అన్నా రాంబాబు విమర్శించారు. చిత్తూరు జిల్లాలో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన నాయకునితో పాటు అతని సహచరులు కలిసి కుటీర పరిశ్రమలాగా నకిలీ మద్యం తయారు చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు, పార్టీ ఎస్ఈసీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు ఉడుముల కోటిరెడ్డి, మార్కాపురం జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని కోరారు. నకిలీ మద్యం వలన చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు పార్టీ నేతలు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ముందుగా స్థానిక పామూరు బస్టాండ్‌లోని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ ఇంటి వద్ద నుంచి ఎక్సైజ్ శాఖ ఆఫీసు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిప్రతాన్ని ఎక్సైజ్ సీఐ ఆర్.విజయభాస్కర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్మినేని సుజాతరెడ్డి, పార్టీ అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు అయిమళ్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నారా బ్రాండ్ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు బలి...

కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. తాను చేస్తున్న తప్పులను ఎదుటివారి మీదకు నెట్టడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఇప్పుడు కూడా దొడ్డిదారిన కల్తీ మద్యం వ్యాపారం చేస్తూ లిక్కర్ స్కాం అంటూ వైఎస్సార్ సీపీ మీద ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకురాలు పేరం ప్రసన్న, కొత్తపట్నం మండలాధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కసుకుర్తి ఆదెన్న, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



దర్శి ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కనిగిరిలో నిరసన ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు

నాణ్యం పేరుతో కల్తీ మద్యం

- ఊరూరా నారావారి కల్తీ బుద్ధి
- కూటమి నాయకుల జేబులు నింపడమే లక్ష్యంగా మద్యం వ్యాపారం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం

యర్రగొండపాలెం: కల్తీ మద్యం సరఫరా చేసే ఆలోచన మనస్సులో పెట్టుకొని నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పిన ఏకైక నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాజకీయ చరిత్రలో కనీసం నాణ్యమైన మంచి నీళ్లు ఇచ్చిన చరిత్ర లేదని ఆయన విమర్శించారు. బాబు మాటలు నమ్మిన మద్యం ప్రియుల నోట్లో మట్టి కొడుతున్నాడని, రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం సరఫరా చేసి వారి ప్రాణాలను హరిస్తున్నాడని విమర్శించారు. కూటమి నాయకులు దోపిడీనే లక్ష్యంగా చేసుకొని అడ్డగోలుగా దోచుకోమని వాళ్ల ఎమ్మెల్యేలకు, నాయకులకు ఈ వ్యాపారాన్ని అప్పచెప్పాడని, సినిమా ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్లకు సినిమాలు అప్పచెప్పినట్లు మద్యం వ్యాపారాన్ని దళారులకు అప్పచెప్పాడని అన్నారు. శ్రీకాకుళం, ఉత్తరాంధ్ర, విశాఖపట్నం అయ్యన్నపాత్రుడి పక్కనే ఉన్న నాయకుడికి, బనగానిపల్లెలో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జికి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఇంకొక నాయకుడికి, కృష్ణ, గుంటూరును అక్కడ ఉన్న ఒకరికి ఇస్తే ఇబ్రహీంపట్నంలో పట్టుబడ్డాడని, రాష్ట్రంలో ప్రతి చోట కల్తీ మద్యం ఏరులై పారుతోందని అన్నారు. జగనన్న పాలనలో ఒక్క బెల్ట్ షాపు ఉండేదికాదని, ఆయన పాలనలో రాష్ట్రంలో ఉన్న 40 వేల బెల్ట్ షాపులు తీసివేయిస్తే అప్పట్లో మద్యం అమ్మకాలు తగ్గాయని, అర్ధరాత్రి మద్యం సీసా దొరికేది కాదని అన్నారు. ప్రతి చోట పిప్పరమెంట్ దొరకదేమో కానీ నారావారి కల్తీ బుడ్డి దొరుకుతుందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కాలంలో ప్రతి సంవత్సరం 10 శాతం మద్యం అమ్మకాల్లో ఆదాయం వచ్చేదని, మద్యం అమ్మకాలు తగ్గాయని, ఆదాయం పెరిగేదని, ఈ రోజు అమ్మకాలు విపరీతంగా పెరిగాయని, ఆదాయం మాత్రం 3 శాతానికి పడిపోయిందని అన్నారు. 10 శాతం నుంచి 3 శాతానికి ఆదాయం పడిపోయిందంటే మిగిలిన ఆ డబ్బు కూటమి ఎమ్మెల్యేల జేబుల్లోకి వెళ్తోందని అన్నారు. ఊరూరా వెలిసిన ఈ సారా కొట్లను ధ్వంసం చేయాల్సిన అవసరం ఉందని, తక్షణమే ఎక్సైజ్ శాఖవారు జోక్యం చేసుకొని వీటిని అదుపు చేయకపోతే మహిళలే ఆ షాపులపై తిరగబడతారని హెచ్చరించారు. 30 వేల మంది కల్తీమద్యం బారినపడి చనిపోయారని సిగ్గులేకుండా టీడీపీ నాయకులు చెప్పారని, చనిపోయిన వారిపేర్లు ఈ నాటివరకు చెప్పడంలేదని, కల్తీమద్యంతో పట్టుబడిన టీడీపీ నాయకులే ఆ వ్యాపారాన్ని చేస్తూ గతంలో వ్యాపారం జరిగిందని ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు నీతిమాలిన రాజకీయాన్ని ఆపాలని, మద్యం, వ్యవసాయం, మట్టి, ఇసుక, గనులను ప్రైవేటు వారికి అమ్మేస్తున్నాడని, ఈ రోజు గ్రానైట్ ఇండస్ట్రీ పనిచేయడం లేదని, ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి సీనరేజీలు వసూలు చేస్తున్నారని అన్నారు. జిల్లాకు వచ్చిన మెడికల్ కాలేజీని తమకు అనుకూలమైన ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశాడని, ఇటువంటి ఒంటెత్తు పోకడలు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తే మరో నేపాల్ మాదిరిగా ఆంధ్ర రాష్ట్ర మారుతుందని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

కాటేసిన దారులు

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం
- కొనకనమిట్ల మండలంలో పెళ్లి వేడుకకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకులు
- సీఎస్‌పురం మండలంలో గుర్తుతెలియని వ్యక్తిని బైక్ ఢీకొని ఇద్దరు మృత్యువాత

కొనకనమిట్ల/పామూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పెళ్లి వేడుకలకు వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్న ఇద్దరు యువకులను మృత్యువు కబళించింది. ఈ సంఘటన 565 జాతీయ రహదారి మార్కాపురం-పొదిలి రహదారి ఎదురాళ్లపాడు, చౌటపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మార్కాపురం మండలం బడేకాన్ చింతగుంట గ్రామానికి చెందిన డి.తిరుపతయ్య కుమారుడు గణేష్ (18), పి.ఆంజనేయులు కుమారుడు అభినాష్(19)లు కొనకనమిట్ల మండలం ఎదురురాళ్లపాడులో జరిగిన పెళ్లి వేడుకలకు వచ్చి తిరిగి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. వారితో పాటు మరికొంతమంది చింతగుంట నుంచి పెళ్లి వేడుకలకు వచ్చి ట్రాక్టర్‌లో వెళుతున్నారు. అదే సమయంలో వర్షం రావటంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆపి పట్ట కప్పుకుంటున్నారు. ట్రాక్టర్ కంటే ముందు వెళ్లిన గణేష్, అభినాష్‌లు ట్రాక్టర్ రాకపోయేసరికి ఏమైందోనని మళ్లీ వెనక్కి వచ్చి ట్రాక్టర్ వెళుతుండటం చూసి మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. కొంత దూరం వెళ్లగానే వెనుక వెస్తున్న మోటార్ సైకిల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న గణేష్, అభినాష్‌లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్‌లో ఉన్న వారి బంధువులు గమనించి 108కు సమాచారం అందించగా 108 వాహనంలో ఇద్దరిని కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.





కొనకనమిట్ల: మృతి చెందిన గణేష్, అభినాష్

పెళ్లింట విషాదం..

నిన్నటి వరకు పెళ్లి వేడుకల్లో సరదాగా గడిపిన తమ బంధువుల పిల్లలు మరుల పెళ్లికి వచ్చి మృతి చెందటంతో చింతగుంటలో పెళ్లింట విషాదం నెలకొంది. యువకుల మృతదేహాలను చూసి బంధువులు బోరున విలపించారు.

బాబాయిని వదిలి వచ్చేందుకు వెళ్తూ..

జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తిని బైక్ ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన సీఎస్‌పురం మండలంలోని అరివేముల బస్‌స్టాప్ జంక్షన్ సమీపంలో 167బి మైదుకూరు-సింగరాయకొండ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ టి.అచ్చిరెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని క్రిష్ణంనాయునిపల్లి గ్రామానికి చెందిన కాటసాని రవి (31) హైదరాబాద్ వెళ్లేందుకు సీఎస్‌పురం వరకు వదలిపెట్టేందుకు తన బాబాయి కాటసాని తిరుపతిరెడ్డిని బైక్‌పై ఎక్కించుకుని సీఎస్‌పురం వస్తున్నాడు. ఈ సందర్భంలో జాతీయ రహదారిపై అరివేముల బస్‌స్టాప్ జంక్షన్ సమీపంలో మతిస్థిమితంలేని గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా బైక్‌కు అడ్డురాగా బైక్ అతనిని ఢీకొట్టి రోడ్డుపక్కన ఉన్న గుంతలో పడింది. బైక్ తగలడంతో అడ్డుగా వచ్చిన మతిస్థిమితంలేని గుర్తుతెలియని వ్యక్తి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా బైక్ నడుపుతున్న రవి గుంతలోని రాయిమీద పడగా తలకు, ఛాతికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో బైక్ వెనుక కూర్చున్న కాటసాని తిరుపతిరెడ్డికి మోస్తారు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌ఓ జి.అచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కనిగిరి వైద్యశాలకు తరలించారు. మృతుడు రవి హైదరాబాద్‌లో పీజీ నిర్వహిస్తూ స్వగ్రామానికి వస్తూ పోతూ ఉంటాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. అప్పటి వరకు తమతో ఉన్న రవి రోడ్డు ప్రమాదంలో ఇలా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండగా గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



కాటసాని రవి మృతదేహం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విద్యుదాఘాతానికి బేల్దారి కూలీ మృతి

కంభం: విద్యుదాఘాతానికి బేల్దారి కూలీ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..కందులాపురం కూడలి సమీపంలో నిర్మాణంలో ఓ గృహం వద్ద పసుపుల పెద్ద గురువయ్య(53) అనే వ్యక్తి పనిచేస్తున్న సమయంలో ఆ గృహానికి ముందు భాగంలో ఉన్న విద్యుత్‌లైన్ తీగలకు తగిలి షాక్ గురై కిందకు పడిపోయాడు. అతన్ని వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.



మృతి చెందిన పెద్దగురువయ్య

గడువు లోగా పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను నిర్దిత గడువు లోగా చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ×ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, పార్థసారథి, విజయజ్యోతిలు అర్జీలు స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో ప్రజలు మన దగ్గరకు వస్తారని, ఆ నమ్మకాన్ని ప్రతి అధికారి నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

సీపీఆర్‌పై మాక్‌డ్రిల్

ఈ సందర్భంగా సీపీఆర్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆకస్మాత్తుగా ఎవరైనా గుండెపోటుతో పడిపోతే ఏ విధంగా సీపీఆర్ చేయాలో వైద్యులు అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, డీసీహెస్ డాక్టర్ సూరిబాబు, డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు సీపీఆర్ చేయాల్సిన పద్ధతిని వివరించారు.

వాగు పొంగి నిలిచిన రాకపోకలు

నాగులుప్పలపాడు: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని తిమ్మనపాలెం- నాగులుప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న కొత్తకోట వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసులు వాగు వద్ద పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారు.



కొత్తకోట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించండి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ రాజాబాబు సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో నాటుసారా తయారీ, నిర్మూలనకు తీసుకున్న చర్యలు, బెల్ట్ షాపుల నిర్వాకులపై కేసుల నమోదు, నూతన ఎక్సైజ్ పాలసీ విధానం, అమలు తదితర వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఐడీ లిక్కర్ పీడిత గ్రామాల్లో నాటుసారా నిర్మూలించి ప్రభుత్వ లక్ష్యం చేరుకునేలా పనిచేయాలన్నారు. ఆ వృత్తి నుంచి వారి కుటుంబాలను దూరం చేసి సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి మార్గాలను వారికి కల్పించేలా ప్రభుత్వం కల్పించే సంబంధిత రాయితీలను, పథకాలను వారికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలంటూ ఆందోళన

మార్కాపురం: లారీ డ్రైవర్‌ను కొట్టిన ఓనర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్ తరఫు వారు సోమవారం మార్కాపురం పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పట్టణంలోని సుందరయ్యకాలనీలో నివాసముండే లారీ డ్రైవర్ నారాయణ మద్యం తాగాడని మూడు రోజుల క్రితం చీమకుర్తికి చెందిన లారీ ఓనర్ మర్రిచెట్లపాలెం సమీపంలో తీవ్రంగా కొట్టాడు. దీంతో పొదిలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో నారాయణ చికిత్స పొందాడు. ఈ సంఘటనకు సంబంధించి లారీ ఓనర్‌పై మార్కాపురం పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకుడు రూబెన్, మరికొంత మంది సుందరయ్యకాలనీ వాసులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులకు, కాలనీ వాసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ విధులను అడ్డుకోవద్దంటూ ఎస్సై సైదుబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొంతసేపు స్వల్ప ఉద్రిక్తత కూడా నెలకొంది. సీపీఎం నాయకుడు రూబెన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో సీపీఎం నాయకుడు రఫీ, తదితరులు స్టేషన్‌కు చేరుకుని మాట్లాడారు. అనంతరం వివాదం సద్దుమణిగింది. కాగా, మార్కాపురం పట్టణ ఎస్సై తన విధులకు ఆటంకం కలిగించారంటూ సీపీఎం నాయకుడు రూబెన్‌పై కేసు నమోదు చేశారు. దీంతో పాటు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేసిన దేవరాజు, మరికొంత మందిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, సుందరయ్యకాలనీవాసులు

శివాలయంలో చోరీ

దొనకొండ: మండలంలోని మంగినపూడి శివాలయంలో దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. శివాలయం గేటు తాళం పగలకొట్టి కానుకల హుండీని తీసుకువెళ్లి పక్కనే చెరువులో పడేసి, అందులోని కానుకలను తీసుకువెళ్లారు. శివాలయం ఎదురు బడ్డీ కొట్టులో తాళం పగలకొట్టి అందులోని పెట్రోలు, ఇతర తినుబండారాలు, సిగరెట్లు, కూల్‌డ్రింక్స్ సీసాలు, కొంత నగదు తీసుకువెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే శివాలయంలో చోరీకి పాల్పడి విలువైన వస్తువులు అపహరించారని గ్రామస్తులు తెలిపారు.



చెరువులో పడేసిన కానుకల హుండీ

గనుల శాఖపై నిరంతర పర్యవేక్షణ

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: గనుల శాఖకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ పి.రాజాబాబు గనుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గనుల శాఖ అధికారులతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలోని గనుల విస్తీర్ణం, ప్రభుత్వానికి రావాల్సిన రాబడిపై, గనుల రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.432.94 కోట్లు రాబడి లక్ష్యం నిర్దేశించగా, సెప్టెంబర్ నెల వరకు రూ.157.08 కోట్లు వచ్చిందన్నారు. జిల్లాలో మేజర్, మైనర్ మైనింగ్ క్వారీలు ఉండగా, అందులో 144 క్వారీలు పనిచేస్తున్నాయని, 132 క్వారీలు పనిచేయడం లేదని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రాబడి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఎక్కడా అక్రమ మైనింగ్ జరగరాదని స్పష్టం చేశారు. జిల్లాలో ఏ కారణం చేతనైనా మైనింగ్ క్వారీ జరగకపోతే సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ గనుల శాఖ డీడీని ఆదేశించారు.



గనుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

రెండు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

ఒంగోలు: రెండు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. వెలిది బాలాజీ బాబు అనే వ్యక్తి వద్ద నలగర్ల ప్రసాద్ అనే వ్యక్తి రెండు దఫాలుగా రూ.6 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ చెల్లింపు నిమిత్తం రూ.9,03,800 విలువైన చెక్కు జారీచేయగా, దానిని వెలిది బాలాజీ బాబు బ్యాంకులో జమచేయగా బౌన్స్ అయింది. దీంతో బాలాజీ బాబు కోర్టును ఆశ్రయించగా విచారించిన న్యాయమూర్తి.. నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడు నలగర్ల ప్రసాద్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.17,97,600 చెల్లించాలని చెప్పడంతో పాటు కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు జరిమానా విధించారు.

మరో కేసులో...

చిల్లర నందకిషోర్ అనే వ్యక్తి వద్ద పాత్తూరి బాలకృష్ణ అనే వ్యక్తి వద్ద రూ.6 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ నిమిత్తం రూ.8 లక్షలకు చెక్కు జారీ చేయగా నందకిషోర్ బ్యాంకులో జమచేశాడు. అది బౌన్స్ అయినట్లు నిర్ధారణ అయింది. దీంతో నంద కిషోర్ కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన న్యాయమూర్తి నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితునికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, ఫిర్యాదికి రూ.12 లక్షలు చెల్లించాలని చెప్పడంతో పాటు కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు జరిమానా విధించారు.

విద్యుత్ ఉద్యోగులకు పరామర్శ

ఒంగోలు టౌన్: చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి విజయవాడ వెళ్తున్న విద్యుత్ ఉద్యోగుల మినీ బస్సు ఒంగోలు శివారులోని వల్లూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున బోల్తా పడి ఒకరు మరణించగా, 18 మందికి గాయాలవడంతో ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని పలువురు పరామర్శించారు. సమాచారం తెలిసిన వెంటనే పలమనేరు నుంచి విద్యుత్ ఏఈ యానాది అర్జున హుటాహుటిన ఒంగోలు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఒంగోలు ఎస్ఈ సత్యనారాయణ వైద్యశాలకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు వైద్యశాల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యుత్ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. మెరుగైన చికిత్స అందజేయాలని ఆదేశించారు.

కడలి వెంట కన్నీటి చూపులు

- చీరాల ఓడరేవు తీరానికి వచ్చిన గౌతమ్ మృతదేహం
- విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి
- జాడలేని షారోన్
- తీరంలో గాలింపు చర్యల కొనసాగింపు

చీరాల: కడలి కెరటాలు ఆ కుటుంబాలలో కన్నీటిని మిగిల్చాయి. సరదాగా సేద తీరేందుకు చీరాల ఓడరేవు తీరానికి వచ్చి సముద్రస్నానం చేస్తుండగా అలల తాకిడికి గల్లంతైన ఐదుగురు విద్యార్థులలో ఆదివారమే ముగ్గురు మృతదేహాలు లభ్యమవగా, సోమవారం మరో విద్యార్థి మృతదేహం తీరానికి చేరింది. దీంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అమరావతిలోని విట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ చదువుతున్న ఏడుగురు స్నేహితులు ఆదివారం సెలవు దినం కావడంతో సరదాగా గడిపేందుకు చీరాల ఓడరేవు సముద్రతీరానికి వచ్చి గల్లంతైన విషయం విదితమే. స్థానిక మత్స్యకారులు గమనించి నలుగురు విద్యార్థులను బయటకు తీసుకురాగా, సాయి మణిదీప్ (జడ్చర్ల), జీవన్ సాత్విక్ (హైదరాబాద్), శ్రీసాకేత్ (హైదరాబాద్) గల్లంతయ్యారు. కొంత సమయం తర్వాత ముగ్గురి మృతదేహాలు తీరానికి చేరాయి.

భోరుమన్న గౌతమ్ కుటుంబ సభ్యులు...

మరో ఘటనలో వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కూడా ఆదివారం గల్లంతయ్యారు. రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా వీరి ఆచూకీ లభించలేదు. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ స్వయంగా వాడరేవు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మెరైన్, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు రాత్రంతా తీరం వద్దనే వేచి ఉన్నారు. సోమవారం ఉదయం తీరానికి గౌతమ్ కృష్ణప్రసాద్ మృతదేహం వచ్చింది. దీంతో అతని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి...

ఆదివారం లభ్యమైన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు, సోమవారం తీరానికి చేరిన మరో విద్యార్థికి మృతదేహానికి చీరాల ఏరియా వైద్యశాలలో సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థులు గల్లంతైన సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు హుటాహుటిన చీరాల వచ్చి ఏరియా వైద్యశాలలోని మార్చురీలో ఉన్న మృతదేహాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. పెద్ద చదువులు చదువుకుని ఆసరాగా నిలుస్తారని అనుకుంటే అందరినీ వదిలి వెళ్లిపోయారా అంటూ కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు కంటతడి పెట్టించాయి. ఐదో విద్యార్థి షారోన్ ఆచూకీ లభించకపోవడంతో బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



ఒడ్డుకు చేరిన గౌతమ్ మృతదేహం



షారోన్ మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు